సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త అవసరం

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

చిన్నశంకరంపేట (చేగుంట), జూలై 15,ప్రభాతవార్త:

సీజనల్ వ్యాధులు ప్రభల కుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారుల ఆదేశించారు. చేగుంట మండలంలో విస్తృతంగా పర్యటించి పులిమామిడి గ్రామంలో అంగన్వాడి కేంద్రం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను, గ్రామ పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలలో శానిటేషన్ పనులు విస్తృతంగా చేపట్టాలన్నారు. డ్రైడే డ్రై డే కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని చెప్పారు. దోమ లార్వా పెరగ కుండా ఉండేందుకు నీరు నిలవ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్ పాఠశాలను సందర్శించి ప్రశ్నలు సమాధానాలతో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ నేతను హత్యను చేసిన నిందితులను శిక్షించాలి

ఎంఆర్‌పిఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రభాకర్

చిన్నశంకరంపేట, జూలై 15,ప్రభాతవార్త:

కాంగ్రెస్ నాయకుడు అనిల్ కుమార్‌ను హత్య చేసిన నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రభాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం నాడు చిన్నశంకరంపేటలో మాట్లాడుతూ అనిల్ కుమార్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా ఉంటూ పార్టీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. ఇది చూసి ఓర్వలేక అతి దారుణంగా హత్య చేశారన్నారు. నిందితులను పోలీసులు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని యేడల రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గోవర్ధన్, బాల్‌రాజ్, రవి, గోషికే, ప్రభాకర్, బంగరిగల్ల, దుర్గయ్య, ప్రవిణ్, ప్రవిణ్, సంజీవులు, రవి, రాజు, మహేష్, ఉషనగల్ల, బాబయ్య, బాబు, మహేందర్, సుధాకర్, శ్రీనివాస్, ప్రవిణ్, యోహాన్, జాన్ ప్రతాప్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

చిన్నశంకరంపేట (చేగుంట), జూలై 15,ప్రభాతవార్త: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ చేగుంట మండలం పులిమామిడి, బోనాల గ్రామాలలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా 9 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 5 వేల గ్రౌండింగ్ అయి వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని, మిగిలిన ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనుల త్వరితగతిన గ్రౌండింగ్ చేసేలా సంబంధిత అధికారులు సమన్వయంతో ప్రోత్సహించాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో స్పష్టమైన ప్రగతి కనిపించేలా అధికారులు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల పథకంలో నిర్మాణపు పనులు పూర్తిచేయడంలో జిల్లాను ముందు వరుసలో ఉంచాలని కోరారు. ఇందిరమ్మ ఇంటిని ఎంత త్వరగా పూర్తిచేస్తే అంతే త్వరగా బిల్లులు అందిస్తామని లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. లక్ష్యానికి అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా నిరంతర పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ అధికారులను కోరారు. ఒక్కో మునిసిపల్, మండలాల వారీగా కేటాయించిన లక్ష్యం, లబ్ధిదారుల నిర్ధారణ, మంజూరీలు తెలిపినవాటిలో ఎన్ని ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం అయ్యాయి, అవి ఏ దశలో ఉన్నాయి, క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని కలెక్టర్ అధికారులను ఆరా తీశారు. లక్ష్య సాధన కోసం అంకిత భావంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. ఇళ్ల నిర్మాణాలకు నిధుల సమస్య ఎంతమాత్రం లేదని, నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులకు ఆయా దశలను బట్టి వెంటవెంటనే వారి ఖాతాలలో నిధులు జమ చేయడం జరుగుతోందని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసుకునేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో లబ్దిదారులను నేరుగా కలిసి, వారు వెంటనే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా ప్రోత్సహించాలని, ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ ప్రక్రియను నిశిత పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ముగ్గు పోసి,ఇల్లు పునాది తీసుకునేలా అధికారులు చొరవ చూపాలన్నారు.

'వార్త'కు స్పందన

గురుకుల పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్

పాఠశాల నిర్వహణపై అసంతృప్తి, ప్రిన్సిపల్‌పై ఆగ్రహం

పాఠశాల రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

హత్నూర, జూలై 15, ప్రభాతవార్త : వార్త దినపత్రికలో వచ్చిన కథనానికి సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మంగళవారం హత్నూరలోని గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈనెల 13న వార్త దినపత్రికలో "అస్తవ్యస్తంగా గురుకుల పాఠశాల నిర్వహణ" కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. గురుకుల పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పాఠశాల నిర్వహణపై తీవ్రఅసంతృప్తి వ్యక్తం చేశారు. వంట గది, స్టోర్ రూమ్, వంటలను, పాఠశాల వసతి గృహం, మరుగుదొడ్ల, పరిసరాలను, పరిశీలించారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రిన్సిపల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డుల నిర్వహణ రాకుంటే ఎలా అని ఫిర్యాదుల బాక్స్‌ను ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. పాఠశాల తరగతుల భవనం, వసతి గృహం చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాలను అందించాలని ఆదేశించారు. బోధన సిబ్బంది సమయానికి ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. సిబ్బందికి ఉండేందుకు భవనాలు లేవని, ఇతర ప్రాంతాల నుంచి వస్తున్నందున,సమయానికి రాలేకపోతున్నామని వివరణ ఇచ్చినట్లు సమాచారం. తరగతి గదులను పరిశీలించి విద్యా బోధన జరుగుతున్న తీరును,అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

'వార్తకు స్పందన

పారిశుధ్య పనులు చేపట్టిన కార్యదర్శులు

టేక్మాల్, జూలై 15, ప్రభాతవార్త: మండలంలో పారిశుధ్య అస్తవ్యస్తం, కంపు కొడుతున్న గ్రామాలు.. పట్టించుకోని కార్యదర్శులు, పత్తా లేని ప్రత్యేక అధికారులు అనే శీర్షికతో వార్త జాతీయ దిన పత్రికలో మంగళవారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం ఉదయం నుండి సాయంత్రం వరకు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. పిచ్చి గడ్డిని తొలగించేందుకు గడ్డి మందును పిచికారి చేయించారు. ప్రభుత్వం నిధులను విడుదల చేయకపోవడం వల్లే పనులు చేపట్టడంలేదని కార్యదర్శులు అంటున్నారు. ప్రభుత్వం వెంటనే గ్రామ పంచాయతీలకు తగు నిధులను విడుదల చేయాలని ప్రజలు కొరుతున్నారు.

ఎల్లంపల్లిలో పారిశుధ్య పనులు చేస్తున్న దృశ్యం

హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ హబ్‌గా ఆందోలు

వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట, జూలై 15, ప్రభాతవార్త: ఎడ్యుకేషన్ మరియు హెల్త్‌హబ్‌గా ఆందోలును తీర్చిదిద్దుతానని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వర్యులు దామోదర్ రాజనర్సింహ అన్నారు. మంగళవారం అందోలు లోని పలు పాఠశాలలు, కళాశాలలు ఆయన పరిశీలించారు. నియోజకవర్గం కేంద్రంలో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందోలును ప్రత్యేక ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రాజెక్టులు చేపట్టినట్లు మంత్రి పేర్కొన్నారు. కెజిబివి పాఠశాలను ఆయన సందర్శించారు. సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన ఆధునిక డిజిటల్ క్లాస్‌రూమ్స్, కంప్యూటర్ ల్యాబ్, కిచెన్ బ్లాక్, విద్యార్థులకు అందిస్తున్న భోజన మెనూ మొదలైన వసతులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను,అభిప్రాయలను తెలుసుకున్నారు. నేడు ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు స్కూళ్లకంటే మెరుగైన మౌలిక వసతులతో ముందున్నాయన్నారు. విద్యారుర్థలకు క్వాలిటీ విద్యను, పోషకాహారాన్ని అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రతి పాఠశాలలో డిజిటల్ లర్నింగ్ ఫెసిలిటీలు, కంప్యూటర్ విద్య, సైంటిఫిక్ ల్యాబ్స్ వంటివి అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం అందోలు పట్టణంలోని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నర్సింగ్ కాలేజీ పనులను, కాంపౌండ్ వాల్ నిర్మాణం,ఇతర వసతులను మంత్రి స్వయంగా పరిశీలించారు. సామాజిక అవసరాలను తీర్చేలా నర్సింగ్ విద్యార్థులకు అత్యాధునిక వసతులు కల్పించాలన్నదే ప్రభుత్వం లక్ష్యం అన్నారు. వేగంగా నిర్మాణం పూర్తిచేసి, త్వరలో తరగతులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మంత్రి పర్యటనలో భాగంగా నాందేడ్ జాతీయ రహదారి నుంచి జోగిపేట అందోలు వరకు నిర్మిస్తున్న నాలుగు లైన్ల రహదారి పనులు పరిశీలించారు. అందోలు ఫ్లైఓవర్ నుంచి జోగిపేట పట్టణానికి చేరుకునే ప్రధాన మార్గంగా అభివృద్ధి చేస్తన్న ఈ రహదారి ప్రజలకు మెరుగైన రవాణ మౌలిక వసతులు అందంచనున్నారు. ఈ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని మంత్రి నేషనల్ హైవే అథారిటీ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అందోలు పాలిటెక్నిక్ కళాశాలలో వసతులు పరిశీలిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

గవర్నర్ పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేయాలి

అధికారులకు దిశ నిర్దేశం చేసిన సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

గవర్నర్ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

కోహెడ, జూలై 15, ప్రభాతవార్త : మండలంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మ త్వరలో పర్యటించనున్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లను సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు దిశ నిర్దేశం చేశారు. కోహెడలో భారీ సభ నిర్వహించడంతో పాటు స్టీల్ బ్యాంక్ ప్రారంభం, డ్వాక్రా మహిళలకు వడ్డీ రుణాల పంపిణీ తదితర కార్యక్రమాల నిర్వహణకు స్టేజ్, వివిఐపి గ్యాలరీ ఏర్పాటు, విఐపి పార్కింగ్, సాధారణ పౌరుల వాహనాల పార్కింగ్ బారికేడ్ల ఏర్పాటు ప్రతిది ఒక ప్రణాళిక ప్రకారం ఎక్కడా నిబంధనలు అతిక్రమించకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలోని మైదానంలో తాత్కాలిక హెలిప్యాడ్ ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. త్వరలో కోహెడ మండల పరిధిలోని బస్వాపూర్‌లో పలువురు మంత్రులు 50 ఎకరాలలో అయిల్‌ఫామ్ మొక్కలు నాటే కార్యక్రమ ఏర్పాట్లును కలెక్టర్ పరిశీలించారు. గుంతలు తీయడం, నర్సరీల నుంచి మొక్కల తీసువచ్చి అందుబాటులో ఉంచాలని ఉద్యానవనశాఖ అధికారులను ఆదేశించారు. ఆమె వెంట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, ఆర్డీఓ రామ్మూర్తి, ఎసిపి సదానందం, డిఆర్‌డిఎ పిడి జయదేవ్ అర్య, తహశీల్దార్, ఎంపిడిఓ తదితరులు పాల్గొన్నారు.

లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేసిన కలెక్టర్

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:

ఇందిరమ్మఇళ్లు మంజూరైన లబ్దిదారులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేసుకోవాలని జిల్లాకలెక్టర్ హైమావతి సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జనగామ నియోజకవర్గం జిల్లాలోని 4 మండలాలోని 415 మంది లబ్దిదారులకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. చేర్యాల 160, కొమురవెల్లి 84, దూళ్‌మిట్ట 76, మద్దూర్ 95 మంది చొప్పున ఇందిరమ్మ ఇళ్లు రెండో విడతలో మంజూరు వచ్చినట్లు తెలిపారు. అందరికి సొంత ఇల్లు అనేది గౌరవ సూచికమని.. ఈ సువర్ణ అవకాశాన్ని లబ్దిదారులకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటి నిర్మాణం కోసం 60 గజాలలోపు స్థలం ఉండాలని ఇంటి నిర్మాణానికి సంబంధించి వివరాలను ఎప్పటికప్పుడు అధికారులకు తెలియజేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా 8 ట్రిప్పుల ఇసుక అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే ఇల్లు మంజూరు వచ్చి ఆర్థిక స్తోమత లేని నిరుపేద లబ్దిదారులకు ఎస్‌హెచ్‌జిల ద్వారా ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, హౌసింగ్ పిడి దామోదర్‌రావు,ఆయా మండలాల లబ్దిదారులు, అధికారులు పాల్గొన్నారు.

'వార్త' ప్రభావం

చింతల్ చెరువు గ్రామాన్ని సందర్శించిన అధికారులు

హత్నూర, జూలై 15, ప్రభాతవార్త: '

వార్త' కథనానికి రెవెన్యూ అధికా రులు స్పందించారు. సోమవారం 'వార్త' దినపత్రికలో వచ్చిన కథనం "ప్రభుత్వ భూముల్లో యధేచ్చగా మట్టి తవ్వకాలు" శీర్షికకు స్పందించిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హరిబాబు, పంచాయతీ కార్యదర్శి పద్మ సోమవారం చింతలచెరువు గ్రామం పరిధిలోని మట్టి తవ్వకాలు సాగించిన ప్రభుత్వ భూములను పరిశీలించారు. అక్రమంగా మట్టి తరలించిన విషయాన్ని గుర్తిం చారు. ఈ సందర్భంగా ఆర్ఐ హరిబాబు మాట్లాడుతూ తహసీల్దార్ ఆదేశాలుమేరకు మట్టి తరలించిన భూములను పరిశీలించామని, ప్రభుత్వ భూమి నుంచి మట్టి విక్రయించిన వారందరికీ నోటీసులు జారీ చేసి శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఆర్ఐ హరిబాబు తెలిపారు.

మట్టి తవ్వకాలు జరిపిన భూములను పరిశీలిస్తున్న అధికారులు

ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స అందుకుంటున్న మహిళ

ఓవర్‌లోడ్‌తో లిఫ్ట్ ప్రమాదం

-14 మంది మహిళలకు గాయాలు

రామచంద్రాపురం, జూలై 15, ప్రభాతవార్త: ఓవర్‌లోడ్ కారణంగా లిఫ్ట్ జారిపడటంతో14 మంది మహిళలు గాయాలకు గురైన సంఘటన రామచంద్రాపురంలో మంగళవారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, బాధితుల కథనం ప్రకారం... రామచంద్రాపురం విద్యుత్ సబ్ స్టేషన్ ముందర ఉన్న స్రవంతి సిల్క్ బట్టల దుకాణంను ఖాళీ చేస్తూ బట్టలను కొత్త దుకాణంలోకి (పై ఫ్లోర్ నుంచి కింది ఫ్లోర్‌కు) తరలించే క్రమంలో లిఫ్ట్‌లో ఒకే మారు బట్టలతో పాటు 14 మంది మహిళలు (దుకాణంలోని బట్టలను కొత్త దుకాణంలోని తరలించేందుకు కుదిరిన కూలీలు) ఎక్కడంతో ఓవర్ లోడ్‌లో లిఫ్ట్ ప్రమాదానికి గురయింది. లిఫ్ట్‌లో ఉన్న మహిళ పింకి కాలుకు గాయమై విరిగిపోగా మిగతా మహిళలు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదాన్ని పసిగట్టిన స్థానికులు క్షతగాత్రురాలు పింకిని పనేషియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పనిచేసేందుకు వచ్చిన వారితో తమకు సంబంధం లేదని బట్టల దుకాణం యజమాని నిర్మల నిర్లక్ష్యంగా వ్యవహరించడం, గాయపడిన క్షతగాత్రురాలను కనీసం ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్కువ ఎత్తులో నుంచి లిఫ్ట్ పడటంతో పెద్ద ప్రమాదం తప్పిందని, అదే రెండో ఫ్లోర్ నుంచి జారిపడిపోతే పెద్ద ప్రమాదమే జరిగేదని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ఢీకొట్టి తప్పించుకునేందుకు డ్రైవర్ యత్నం..

పోలీసుల తనిఖీ పట్టుబడిన డ్రైవర్

టేక్మాల్, జూలై 15, ప్రభాతవార్త : మండల పరిధిలోని కాద్లూర్ గ్రామ శివారు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. అల్లాదుర్గం మండలం ముప్పారం తండాకు చెందిన వాల్యా (48) టేక్మాల్ నుండి ఎక్సెల్ వాహనంపై బొడ్మట్‌పల్లి మీదుగా ముప్పారం వెళ్తుండగా బులేర వాహనం అతివేగంగా వస్తు ఢీకొట్టి తప్పించుకునేందుకుగాను డ్రైవర్ ప్రయత్నించాడు. టేక్మాల్ ఎఎస్ఐ క్రిష్ణ సిబ్బందితో వాహనాల తనిఖీ చేస్తుండగా పడ్డుబడ్డాడు. డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతివేగంగా వస్తు ఢీకొట్టిన వాహనం దాటికి ఎక్సెల్ పై ఉన్న వాల్య మృతదేహం పది మీటర్ల దూరంలో కాళ్లు చేతులు విరిగి మాంసం ముద్ద రూపంలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతుమన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్టు

-8 కిలోల ఎండు గంజాయి స్వాధీనం

రామచంద్రాపురం, జూలై 15, ప్రభాతవార్త: ఎండుగంజాయిని విక్రయిస్తున్న యువకుడిని మంగళవారం మధ్యాహ్నం రామచంద్రాపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా మన్నెక్కెల్లి గ్రామానికి చెందిన ఖురేషి షబ్బీర్ (21) ఒడిషా రాష్ట్రం నుంచి 8 కిలోల ఎండుగంజాయిని తీసుకుని రామచంద్రాపురం ప్రాంతంలోని ఇక్రసాట్ ముందర పారగన్ చెప్పు కంపెనీ సమీపంలో పలువురికి అమ్మేందుకు యత్నిస్తుండగా నమ్మదగిన సమాచారం అందందంతో ఇబ్బందితో కలిసి దాడి చేసి గంజాయిని విక్రయిస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకుని 8 కిలోల ఎండు గంజాయిని, నిందితుడి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామచంద్రాపురం పోలీసు ఠాణా పోలీసులు పేర్కొన్నారు

గంజాయిని విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

పథకం ప్రకారమే కాంగ్రెస్ యువ నాయకుడు మారెల్లి అనిల్ హత్య

అనిల్ చేతిపై ఉన్న ఫోన్ నంబర్ ఎవరిది..?
హైదరాబాద్‌లోని ప్రముఖ నిర్మాణ సంస్థకు అనిల్ మధ్య విభేదాలు
అనిల్ మృతదేహాన్ని పరిశీలించిన ఐజీ
4 బృందాలుగా దర్యాప్తు ఎస్పీ

సంగారెడ్డి బ్యూరో, జూలై 15, ప్రభాతవార్త:

కాంగ్రెస్ యువనేత మారెల్లి అనిల్ హత్య ఉదంతం మెదక్ జిల్లాలో సంచలనంగా మారింది. సినీ ఫక్కీలో వెంబడించి కాల్పులు జరిపి హత్యా చేశారు అనే వార్త జిల్లాలోని కాంగ్రెస్ నేతల్లోనూ కొల్చారం మండలంలో తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే మెదక్ జిల్లా కొల్చారం మండలం పైతర గ్రామానికి చెందిన మారెల్లి అనిల్ సోమవారం రాత్రిగ్రామ సమీపంలోనే హత్యకు గురయ్యారు. అనిల్ కాంగ్రెస్‌పార్టీ ఎస్సీ సెల్ జిల్లా నాయకులుగా పనిచేస్తున్నారు. అందులో భాగంగానే సోమ వారం హైదరాబాద్ గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని రాత్రి స్వగ్రామానికి చేరుకునే సమయంలోనే హత్యకు గురారయ్యారు.

సిని ఫక్కీలో వెంబడించి కాల్పులు..

సోమవారం గాంధీ భవన్‌లో పార్టీ కార్యక్రమంలో పాల్గొని ఇంటికి వస్తున్న అనిల్‌ను రెండు కార్లలో వెంబడించినట్లు తెలుస్తోంది. కారు డ్రైవర్‌తోపాటు పార్టీ మండల అధ్యక్షుడిని విడిచి తన గ్రామం అయినా పైతరకు ఒంటరిగా వెళ్తున్న క్రమంలో వరిగుంతం సబ్ స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు అనిల్‌పై కాల్పులు జరిపినట్లు సమాచారం. దీంతో కార్ అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకువెళ్లింది. ముందుగు ప్రమాదం జరిగినట్లు భావించిన స్థానికులు మెదక్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.కానీ అనిల్ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అంతేకాకుండా అనిల్ వంటిపైన బుల్లెట్ గాయాలు ఉన్నాయని వైద్యులు తెలిపారు. వెంటనే స్పందించిన పోలీసులు సంఘట స్థలాన్ని పరిశీలించగా మరో నాలుగు బుల్లెట్‌లు కనిపించాయి. దీంతో ప్రమాదం కాదని హత్య జరిగినట్లు గుర్తించి అనిల్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మంగళవారం ఫోరెన్సిక్ నిపుణుల బృందం పోస్టుమార్టం నిర్వహించారు.

సెటిల్‌మెంట్‌లే హత్యకు కారణమా..?

అనిల్ హత్యకు భూ వివాదంలో నెలకొన్న విబేధ నేపథ్యంలోనే జరిగినట్లు కుటుంబీకులు, సన్నిహితులు ఆరోపిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ నిర్మాణ సంస్థకు చెందినవారితో కొంత కాలంగా అనిల్‌కు విభేదాలు ఉన్నట్లు తెలిసింది.అంతేకాకుండా అనిల్ మరణించే ముందు తన ఎడమ చేతిమీద ఒక ఫోన్ నంబర్ రాసు కున్నాడని అది వారికి చెందినదే అని సమాచారం. ఈ కారణంగానే అనిల్‌ను పథకం ప్రకారం వెంబడించి హత్య చేసినట్లు వారు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన ఓ ఎమ్మెల్యే హస్తంఉన్నట్టు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

సంఘట స్థలాన్ని పరిశీలించిన ఐజీ...

వరిగుంతం సబ్ స్టేషన్ సమీపంలో అనిల్ హత్యకు గురైన స్థలాన్ని మంగళవారం ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం కొల్చారం పోలీస్‌స్టేషన్ జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనిల్ ది ముందు ప్రమాదంగా భావించిన పోలీస్‌లు సంఘటన స్థలంలో దొరికిన బుల్లెట్ లు అనిల్ శరీరంలో ఉన్న బుల్లెట్స్ ఆధారంగా అనుమా నాస్పద మృతిగా కేసు నమోదుచేయడం జరిగిందన్నారు. 4 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని తెలిపారు.

ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, ప్రమాద స్థలంలో లభించిన బుల్లెట్లు, కాల్పులు జరపడంతో రోడ్డు పక్కకు వెళ్లిన కారు, మృతి చెందిన అనిల్ కుమార్

విద్యార్థి దశ జీవితంలో ఎంతో కీలకం

-కుకునూరుపల్లి ఎస్సై పండుగ శ్రీనివాస్

మహిళల చట్టాల గురించి అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనివాస్

కొండపాక, జూలై 15, ప్రభాతవార్త:

విద్యార్థిదశ జీవితంలో ఎంతో కీలకమైనదని కుకునూరుపల్లి ఎస్సై పండుగ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కుకునూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మహిళల రక్షణచట్టాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అయన గజ్వేల్ షీటీమ్ బృందంతో కలిసి మాట్లాడారు. మహిళలు వారి రక్షణచట్టాల గురించి, షీ టీమ్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు, నూతన చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. జీవితంలో ఏది సాధించాలన్నా పాఠశాల దశ నుండి ప్రణాళికలు వేసుకొని వాటి కోసం కృషి చేయాలని సూచించారు. అపరిచితుల ఫోన్ కాల్స్, మాటలను నమ్మవద్దన్నారు. సోషల్ మీడియాకు ఎంతదూరంగా ఉంటే భవిష్యత్ అంతమంచిగా ఉంటుందన్నారు. మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. చదువుకునే వయస్సులో చెడు అలవాట్లకు బానిసలు కాకూడదని సూచించారు. ప్రతి విద్యార్థి చదువుపై దృష్టిపెట్టి ఉన్నతస్థాయికి చేరుకునేలా నిరంతరం కృషి చేయాలన్నారు. పిల్లలను చదివించడానికి తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని గమనించి శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవడానికి శ్రమించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. చెడు అలవాట్లకు, డ్రగ్స్‌కు, మత్తుపదార్థాలపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. నేరాలు చేసిన వారిపై నూతన చట్టాల ప్రకారం కఠినశిక్షలు అమలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హేమలత, ఉపాధ్యాయులు అజయ్‌కుమార్‌రెడ్డి, ఎఎస్ఐ సువర్ణ, జగదీశ్వర్, గజ్వేల్ షీటీమ్ సభ్యులు మహేందర్‌రెడ్డి, శ్యామల, మహేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంచుకున్న లక్ష్యంకోసం నిరంతర కృషి

-ఎంఈఒ శ్రీనివాస్‌రెడ్డి

కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంఈఒ

కొండపాక, జూలై 15, ప్రభాతవార్త:

విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఎంఈఒ పి. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం దుద్దెడ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరిన నూతన విద్యార్థులకు ప్రిన్సిపల్ సతీష్ అధ్యక్షతన సీనియర్ విద్యార్థులు స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కన్న తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని అర్థంచేసుకొని బాగా చదివి మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు. పెద్ద పెద్ద లక్ష్యాలను పెట్టుకొని వాటిని సాధించడానికి కృషిచేయాలన్నారు. పాఠశాలలో, కళాశాలలో చదువుతున్న విద్యార్థులందరు ఇంగ్లీష్‌పై మంచి పట్టు సాధించాలన్నారు. ఇంగ్లీష్ ప్రపంచ భాష అయినందున ప్రతి ఒక్కరు ఇంగ్లీష్‌లో ప్రతిభ కలిగి ఉండాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయ బృందం తీసుకుంటున్న చొరవను చూసి వారిని అభినందించారు. టిఎస్‌యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట యాదగిరి మాట్లాడుతూ, తాను విద్యార్థిదశలో గురుకుల పాఠశాలలో చదువుకున్న సందర్భాన్ని గుర్తుచేస్తూ తన అనుభవాలను విద్యార్థులకు వివరించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ప్రిన్సిపల్ సతీష్, సీనియర్ అధ్యాపక బృందం మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మేషక్, సీనియర్ లెక్చరర్‌లు, కృష్ణ, నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

జక్కపల్లి మోడల్ స్కూల్లో ఘనంగా బోనాల పండుగ..

బోనాల పండుగలో బోనాలతో విద్యార్థినులు తదితరులు

నర్సాపూర్, జూలై 15, ప్రభాతవార్త:

నర్సాపూర్ మండల పరిధిలోని జక్కపల్లిలోని తెలంగాణ మోడల్ స్కూల్లో ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని బోనాలపండుగను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఫర్హాన, పిడి అశోక్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు బోనాలను అందంగా అలంకరించి సమీపంలో ఉన్న తునికి అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఫర్హాన, అధ్యాపకులు బోనాల విశిష్టత గురించి బోనాలు ఏవిధంగా వచ్చాయో విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. ఈమేరకు ఈబోనాల పండగలో అధ్యాపకులు, విద్యార్థులు ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా పోతరాజుల విన్యాసాలతో నృత్యాలుచేస్తూ అందరినీ అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఫర్హానా, పిడి అశోక్, అధ్యాపక బృందం, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై మాక్ పోలింగ్

మోడల్ స్కూల్‌లో మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

కొండపాక, జూలై 15, ప్రభాతవార్త:

కొండపాక మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు భారతదేశ ప్రజాస్వామ్యం గొప్పదనం తెలియజేయాలన్న సంకల్పంతో మంగళవారం ఓటు హక్కు ప్రాధాన్యం తెలియజేస్తూ మాక్(నమూనా) ఎన్నికలను నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా నామినేషన్ ప్రక్రియ, నామినేషన్‌ల ఉపసంహరణ, అభ్యర్థుల ఎంపిక, గుర్తుల కేటాయింపు, బ్యాలెటు పత్రాల ముద్రణ, బ్యాలెట్ బాక్స్‌ల తరలింపు, ఓటింగ్ విధానంపై పూర్తిగా ఎన్నికల వాతావరణంలో వివిధ విభాగాలకు ఎన్నికలు నిర్వహించారు. స్కూల్‌లీడర్స్‌కు, కల్చరల్‌లీడర్స్‌కు, ఎన్విరాన్‌మెంటల్ లీడర్స్‌కు, డిసిప్లెన్‌లీడర్‌కు వివిధవిభాగాలకు ఎన్నికలు నిర్వహించారు. ఓటర్లుగా పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. మొదటి ఓటుహక్కును ప్రిన్సిపల్ యాజ్ఞశ్రీ ఉపయోగించుకున్నారు. ఎన్నికల ప్రక్రియను నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించినందుకు ఉపాధ్యాయుల బృందాన్ని అభినందించారు.

మహిళలకు న్యాయ సహాయ సేవలు మరింత విస్తృతం

-జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డిమున్సిపాలిటీ, జూలై 15, ప్రభాతవార్త:

సంగారెడ్డి జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలపై కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మహిళలు, శిశువులు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్‌లకు అందుతున్న సేవలపై అవగాహనపెంచుతూ సౌండ్‌లైబ్రరీ వంటి వినూత్న కార్యక్రమాలపై సమీక్షతోపాటు, సఖికేంద్రం ద్వారా మహిళల హక్కుల పరిరక్షణ, జిల్లా మహిళా సాధికారత ద్వారా జరుగుతున్న కార్యక్రమాలు, నైతిక, న్యాయసహాయ సేవలపై కార్యాచరణ ప్రణాళికలను పునఃసమీక్షించారు. ఈసందర్భముగా జిల్లావ్యాప్తంగా ఐసిడిఎస్ ద్వారా పూర్వ ప్రాథమిక విద్య, గర్భిణులు, బాలింతలకు అందుతున్న పోషకాహార సేవల అమలును సమీక్షించారు. మిషన్ వాత్సల్య ద్వారా బాలలసంక్షేమం, దత్తత ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మహిళా శిశు సంక్షేమ అధికారి లలితకుమారి, సిడిపిఓలు చంద్రకళ, జయరామ్, ప్రియాంక, అంజమ్మ, సుజాత, డిసిపిఓ రత్నం, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ సౌమ్య, జిల్లా మహిళా సాధికారత కోఆర్డినేటర్ పల్లవి, సఖికేంద్రం కోఆర్డినేటర్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కమిషనర్‌కు వినతి



శ్రీరామ్‌చరణ్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎన్జీవోస్ కాలనీవాసులు

నర్సాపూర్, జూలై 15, ప్రభాతవార్త:

నర్సాపూర్ మున్సిపల్‌పరిధిలోని మూడోవార్డు ఎన్జీవోస్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మంగళవారం కాలనీవాసులు కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈసందర్భంగా కాలనీవాసులు ఆనంద్‌కుమార్, హైమద్‌లు మాట్లాడుతూ కాలనీలో మంచి నీటి సమస్య, మురికికాలువల సమస్య, రోడ్ల సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కోతుల, కుక్కల బెడద ఎక్కువైందని పిల్లలను, పెద్దలను గాయపరుస్తున్నాయని, దీంతో కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారని, వర్షాకాలంలో ఈగల, దోమల నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తిచేశారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి మాట్లాడుతూ 3వ వార్డు ఎన్జీవోస్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు ఇతరులు పాల్గొన్నారు.

ఎన్‌సిసిలో చేరి దేశసేవలో భాగం కావాలి...

-సుబేదార్ బిక్రమ్‌సింగ్...

ఎన్‌సిసి క్యాడేట్ల ఎంపిక కార్యక్రమానికి హాజరైన సుబేదార్

పాపన్నపేట, జూలై 15, ప్రభాతవార్త:

విద్యార్థులు ఎన్‌సిసిలో చేరి దేశసేవలో భాగం కావాలని ఆర్మీ సుబేదార్ బిక్రమ్‌సింగ్, హవల్దార్ అమిత్‌సైని సూచించారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రమైన పాపన్నపేట ఉన్నత పాఠశాల గ్రౌండ్లో ఎన్‌సిసి క్యాడేట్ల ఎంపిక కార్యక్రమానికి వారు హాజరయ్యారు. ఈసందర్భంగా ఎన్‌సిసి ఇన్చార్జ్‌లు ప్రవీణ్‌కుమార్, శ్రావణ్‌లతో కలిసి ఎన్‌సిసి క్యాడేట్లను ఎంపిక చేశారు. ఈసందర్భంగా వివిధపోటీలను నిర్వహించి 47మంది విద్యార్థులను ఎన్‌సిసిలో చేర్చుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు మహేశ్వర్, ఉపాధ్యాయులు అంజాగౌడ్, రియాజ్, పిడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్లతో కూడిన బదిలీలు

-ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు రాజగోపాల్‌గౌడ్

చిలిపిచెడ్, జూలై 15, ప్రభాతవార్త:

ప్రమోషన్లతో కూడిన బదిలీలు చేపట్టాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు రాజగోపాల్‌గౌడ్ అన్నారు. చిలిప్‌చెడ్ మండలంలోని వివిధ పాఠశాలలలో సభ్యత్వనమోదు కార్యక్రమం చేపట్టి ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ఉపాధ్యాయులకు ప్రమోషన్లతో కూడిన బదిలీలు చేపట్టాలన్నారు. లేనట్లయితే సీనియర్ ఉపాధ్యాయులకు నష్టం జరుగుతుందన్నారు. టిజిజెఎసితో కుదిరిన ఒప్పందం మేరకు పెండింగ్ బిల్లుల చెల్లింపునకు ప్రతినెల రూ.700 కోట్లు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సుభాష్, మండల అధ్యక్షులు వెంకటకృష్ణ, ప్రధాన కార్యదర్శి మహేష్‌కుమార్, కోశాధికారి నవీన్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

చిన్నశంకరంపేట, జూలై 15, ప్రభాతవార్త:

చిన్నశంకరంపేట నూతన తహసీల్దార్‌గా వచ్చిన మాలతిని జాతీయ మానవ హక్కుల సంఘం మండల అధ్యక్షుడు సిరిగద్దే దామోదర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, మెదక్ జిల్లా అధ్యక్షులు సాయి ప్రసాద్‌యాదవ్, ఉపాధ్యక్షులు రాధాక్రిష్ణ తదితరులు ఉన్నారు.

పిచ్చి మొక్కలతో విష పురుగుల సంచారం

స్వంత డబ్బులతో గడ్డిమందు కొడుతున్న యువకులు

కొండాపూర్, జూలై 15, ప్రభాతవార్త:

వర్షాకాలం కావడంతో చర్ల గోపులారం గ్రామంలో వివిధరకాల మొక్కలు, గడ్డి విపరీతంగా పెరిగాయి. ఇళ్ల చుట్టుపక్కల విపరీతమైన గడ్డి పెరగడంతో అందులో నుంచి పాములు, తేళ్లు, దోమలు, వివిధరకాల విషపురుగులు ఇళ్లలోకి వస్తున్నాయి. దీనితో అక్కడ ఉంటున్న ప్రజలు భయభ్రాంతులకు గురి అవుతున్నారు. దోమలకాటుకు గురై విషజ్వరాల పాలవుతూ వ్యాధులబారిన పడుతున్నారు. రాష్ట్రనాయకులు ఉమ్మడి మెదక్ జిల్లా ఎస్సి, ఎస్టి అట్రాసిటీస్ అండ్ విజిలెన్స్ కమిషన్ మాజీ మెంబర్ డి.ప్రేమానందం, ఆధ్వర్యంలో గ్రామపెద్దలు మాజీసర్పంచ్ పట్నం రత్నయ్య, పంచాయతీ మాజీ సభ్యులతో, యువకులతో చర్చించి గడ్డిమందు, దోమల నివారణమందు సొంతడబ్బులు సమకూర్చుకొని పిచికారి చేయడం జరిగింది.

రైతుసేవా సహకారసంఘానికి అవార్డు

-మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్న చైర్మన్ రమేష్

అవార్డు అందుకుంటున్న దృశ్యం

పాపన్నపేట, జూలై 15, ప్రభాతవార్త:

సొసైటీ సభ్యులకు మెరుగైన ఆర్థిక వినిమయ సేవలు అందించి, లాభాల్లో రైతులకు 10శాతం డివిడెంట్ పంచిన కొత్తపల్లి రైతుసేవా సహకారసంఘం చైర్మన్ త్యార్ల రమేష్‌కు మంగళవారం హైద్రాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, సహకారశాఖ కమిషనర్ సురేంద్రమోహన్, నాబార్డ్ జిఎం ఉదయ్‌భాస్కర్ చేతులమీదుగా అవార్డు అందజేశారు. నాబార్డ్ ఆధ్వర్యంలో మెదక్ ఉమ్మడిజిల్లా నుండి కొత్తపల్లి రైతుసేవా సహకార సంఘాన్ని ఎంపికచేశారు. సొసైటీకి వచ్చిన లాభాల్లో సుమారు రూ.17.50 లక్షలు సభ్యులైన రైతులకు 10శాతం చొప్పున వారిఖాతాల్లో జమచేశారు. రైతులకు రుణాలపంపిణీ, వాటి రికవరీ, పెట్రోల్, డీజిల్ బంకుల నిర్వహణ, ధాన్యం కొనుగోలుకేంద్రాల నిర్వహణ, ఫర్టిలైజర్ సేవలు తదితర విభాగాలకు సంబంధించి ఈ అవార్డును అందజేసినట్లు చైర్మన్ రమేష్ తెలిపారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

-సెర్ఫ్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ మహిపాల్

నంగునూర్, జూలై 15, ప్రభాతవార్త:

మహిళ ఆరోగ్యంగా ఉన్నప్పుడే వారి కుటుంబం బాగుంటుందని సెర్ఫ్ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ మైపాల్ అన్నారు. డిఆర్‌డిఓ జగదేవ్ ఆర్య ఆదేశాలమేరకు మంగళవారం మండలపరిధిలోని నంగునూర్, గట్ల మల్యాల, రాజగోపాల్‌పేట పిహెచ్‌సిలలో మహిళలకు రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో సిసిలు మల్లేశం, సాయిలు, వివోఎలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

-రాజగోపాల్‌పేట ఎస్ఐ వివేక్

నంగునూర్, జూలై 15, ప్రభాతవార్త:

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని రాజగోపాల్‌పేట ఎస్ఐ వివేక్ అన్నారు. మంగళవారం రాజగోపాల్ పేటగ్రామంలో డ్రగ్స్, గంజాయి, ఆన్‌లైన్‌గేమ్స్, సైబర్‌నేరాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచాన్ని భయపెడుతున్న వివిధ సమస్యలలో డ్రగ్స్ వినియోగం ప్రధానమైనదని, యువత డ్రగ్స్‌కు బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు, పోలీసుసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు...

-తీవ్ర పోషణలోపం ఉన్న పిల్లలపై ప్రత్యేకశ్రద్ధ వహించాలి

-అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసిన మెదక్ జిల్లా సంక్షేమ అధికారి హైమావతి



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి హైమావతి

నర్సాపూర్ రూరల్, జూలై 15,ప్రభాతవార్త:

అంగన్‌వాడీ కేంద్రాలలో 0నుంచి 5సంవత్సరాల వయసున్న పిల్లలలో ఆరోగ్య పరిస్థితులు ఎలా ఉన్నాయని మెదక్‌జిల్లా సంక్షేమాధికారి హైమావతి మంగళవారం తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోషణలోపం లేని పిల్లలు ఎక్కడైతే లేరో ఆగ్రామాలలో ప్రత్యేకంగా సందర్శన చేయడం జరుగు తుందని తెలిపారు. ప్రతిపిల్లవాడిని వయసుకు తగ్గ బరువు, ఎత్తు, ఎత్తుకు తగ్గ బరువు ఉన్నారా, లేరా అని స్వయంగా తనిఖీచేసి తెలుసుకోవడం కోసమే ఈసందర్శన చేస్తున్నానని తెలిపారు. ఎవరైనా పోషణలోపం ఉన్న పిల్లలు ఉంటే వారిపై ప్రత్యేకశ్రద్ధవహిస్తామని, ప్రత్యేకంగా డాక్టర్ల వద్దకు తీసుకువెళ్లడం జరుగుతుందని తెలిపారు. వారికి ఉచిత వైద్యం అందేలా చేస్తామని తెలిపారు. ఎక్కడైతే పోషణలోపం ఉన్న పిల్లల్ని అంగన్‌వాడీ టీచర్లు గుర్తించకుండా వారిపై నిర్లక్ష్యం వహిస్తే మాత్రం తక్షణమే చర్యలు తీసుకోబడతాయని ఈ సందర్భంగా తెలిపారు. ప్రీస్కూల్ పిల్లల నమోదు శాతాన్ని పెంచాలని, ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రాలలో మెనూప్రకారం వంటచేయాలి. గర్భిణీలు, బాలింతలు అంగన్‌వాడీకేంద్రంలో తినాలని సూచించారు. విధులపట్ల నిర్లక్ష్యంవహిస్తే ఆయా, టీచర్‌పై తక్షణ చర్యలు తీసుకుంటానని తెలిపారు. అంగన్‌వాడీకేంద్రంలో రికార్డులను, ఆన్లైన్లో ఉన్న లబ్దిదారులను క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న న్యూట్రిగార్డెన్‌లను పరిశీలించి ప్రతి అంగన్‌వాడీ కేంద్రాలలో కూడా న్యూట్రిగార్డెన్‌లు ఉండాలని ఈ విధంగా మనం పెంచుకుంటే మందులులేని ఆకుకూరలను, కూరగాయలను గర్భిణీలకు బాలింతలకు, పిల్లలకు అందించవచ్చు అని తెలిపారు. దీని ద్వారా పిల్లలు, తల్లులు సంపూర్ణ ఆరోగ్యవంతులు అవుతారని తెలిపారు. కార్యక్రమంలో నర్సాపూర్ సిడిపిఓ హేమ, భార్గవిలు పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం పచ్చదనాన్ని కాపాడుదాం

-పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

-ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అరవింద్

-మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి

మొక్కలు నాటుతున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అరవింద్

నర్సాపూర్, జూలై 15, ప్రభాతవార్త:

విద్యార్థులతోపాటు ప్రతి ఒక్కరూ అందరూ మొక్కలునాటి పచ్చదనాన్ని కాపాడాలని అదేవిధంగా పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిదని నర్సాపూర్ ఫారెస్ట్ రేంజ్ అధికారి అరవింద్, నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం నర్సాపూర్‌ప్రభుత్వ డిగ్రీకళాశాలలో కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపల్ ఆదెప్ప అధ్యక్షతలో జాతీయ సేవా పథకం లైవ్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో వన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంతేగాక ఏక్‌పెడ్ మాకేనామ్‌పే అనే కార్యక్రమంలో విద్యార్థులతోకలిసి అందరూ మొక్కలు నాటారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అరవింద్, మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్మాత్మకంగాచేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి విద్యార్థి ప్రతి ఒక్కరూ ఖాళీప్రదేశాల్లో మొక్కలు నాటాలన్నారు. నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. అనంతరం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అరవింద్ మాట్లాడుతూ వనసంపద తరిగిపోతున్న ప్రస్తుతతరుణంలో యువత తమవంతుబాధ్యతగా సమాజంలో చైతన్యం తీసుకువచ్చి ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజున విధిగా మొక్కలు నాటి వాటిని రక్షించాలన్నారు. డిగ్రీకళాశాల ఇంచార్జ్‌ప్రిన్సిపల్ ఆదెప్ప మాట్లాడుతూ వాహనాల వల్ల కాలుష్యం విపరీతంగా పెరిగిపోయి ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. వీటి నివారణ కోసం మొక్కలునాటి చెట్లను రక్షించాలన్నారు. గ్రామస్థాయిలో కూడా ప్రజల్లో చైతన్యం కలిగించి మొక్కలునాటేవిధంగా చేయాలన్నారు. ఈసందర్భంగా ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సాయిరాం, ప్రోగ్రాం అధికారులు డాక్టర్‌సురేష్‌కుమార్, శ్రీనివాస్, అధ్యాపకులు రమేష్, రవికుమార్, ఆరిఫ్, హేమంత్ ప్రసంగించి విద్యార్థులకు చైతన్యం కలిగించారు. కార్యక్రమం ముందు కళాశాల ఆవరణలో ఏక్‌పెడ్ మాకేనామ్‌పే ఆవశ్యకతపై డ్రాయింగ్ కాంపిటిషన్ నిర్వహించగా విద్యార్థులు గీసిన చిత్రాలను వీక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధికారులు, అధ్యాపకబృందం విద్యార్థినీవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బిసిలకు రిజర్వేషన్లు కల్పించాకే స్థానికసంస్థల ఎన్నికలు

-గ్రంథాలయాల సంస్థ మాజీచైర్మన్ దొంతి చంద్రాగౌడ్ డిమాండ్

మహాధర్నాలో పాల్గొన్న దొంతి చంద్రాగౌడ్ తదితరులు

నర్సాపూర్, జూలై 15, ప్రభాతవార్త:

రాష్ట్రప్రభుత్వం బిసి సామాజిక వర్గానికి 42శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానికసంస్థల ఎన్నికలు జరిపించాలని బిఆర్ఎస్ సీనియర్‌నాయకులు, మెదక్ జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీచైర్మన్ దొంతి చంద్రాగౌడ్ డిమాండ్‌చేశారు. మంగళవారం హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బిసిల మహాధర్నా లో ఆయనపాల్గొన్నారు. ఈసందర్భంగా బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీచైర్మన్ దొంతి చంద్రాగౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం స్థానికసంస్థల ఎన్నికల్లో లబ్ది పొందడానికి ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి వంటి పలు పథకాలను అమలు చేస్తుందని ఆరోపించారు. ఇందులోభాగంగా బిసిలకు 42శాతం రిజర్వేషన్లు స్థానికసంస్థల ఎన్నికలవరకు బిసిరిజర్వేషన్ కల్పించాలని ఆయన డిమాండ్‌చేశారు. బిసిల రిజర్వేషన్లు అమలుచేయలేని ఎడల స్థానిక సంస్థల ఎన్నికలు జరపొద్దని ఖరాఖండిగా చెప్పారు. బిసిల 42శాతం రిజర్వేషన్లను అమలుచేసినతర్వాతే స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్‌చేశారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై విశ్వాసం పోయిందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం 10సంవత్సరాలపాలనలో ఎన్నో సంక్షేమపథకాలు చేశామని, దీంతో ప్రజలకు బిఆర్ఎస్‌పార్టీపై పూర్తి విశ్వాసం ఉందని, రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్‌పార్టీ సత్తాను చాటుతామని అన్నారు. అంతేగాక రానున్నకాలంలో బిఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని కెసిఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతాడన్న ఆశాభావం దొంతి చంద్రాగౌడ్ వ్యక్తంచేశారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలో భద్రతాప్రమాణాలు పాటించని యాజమాన్యాలపై కఠినచర్యలు తీసుకోవాలి

-కలెక్టరేట్ ముందు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

ధర్నా నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

సంగారెడ్డి బ్యూరో, జూలై 15, ప్రభాతవార్త:

పరిశ్రమల్లో భద్రతాప్రమాణాలు పాటించని యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, సిగాచిపరిశ్రమ యాజమాన్యం నిరక్ష్యంతోనే ఘోరప్రమాదం జరిగి 53మంది కార్మికులు మృత్యువాత పడ్డారని, పరిశ్రమ యాజమాన్యాన్ని వెంటనే అరెస్ట్‌చేసి కఠినంగా శిక్షించాలని, మృతిచెందిన కార్మిక కుటుంబాలకు కోటిరూపాయలు, గాయపడినవారికి రూ.50లక్షలు నష్టప

ధర్నాకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

బిసిల ధర్నాకు తరలివెళ్లిన బిఆర్ఎస్ నాయకులు

చేర్యాల, జూలై 15, ప్రభాతవార్త : బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపు మేరకు హైదరాబాద్‌లో నిర్వహించే బిసిల ధర్నాకు ఆ పార్టీ నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ హైదరాబాద్‌లోని నిర్వహించే ధర్నాకు మంగళవారం బిఆర్ఎస్ నాయకులు చేర్యాల నుంచి పెద్దఎత్తున తరలివెళ్లారు. శివగారి అంజయ్య, చింతల పర్శరాములు, కామల్ల అనిల్, ఒగ్గు శ్రీశైలం, రాచకొండ శ్రీనివాస్, పాక బాలయ్య, కాసుల శ్రీనివాస్, మాచర్ల బాబు, కూరపాటి మధు, బండి సుదర్శన్ తరలివెళ్లారు.

పాఠశాలలో పరిశుభ్రతను పాటించాలి : డిఇవో

మాట్లాడుతున్న డిఈవో శ్రీనివాస్‌రెడ్డి

బెజ్జంకి, జూలై 15,ప్రభాతవార్త : పాఠశాలలో పరిశుభ్రతను పాటించాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెరుకబండ, గుండారం, పోతారం గ్రామాల్లోగల ప్రాథమిక పాఠశాలలను గుండారంలోని ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనం, హాజరు రిజిస్టర్లు, విద్యార్థులు సాధిస్తున్న అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ప్రతి రోజు విద్యార్థుల ఎఫ్ఆర్ఎస్ నమోదు చేయాలని విద్యార్థులకు అందిస్తున్న పుస్తకాలు, నోట్‌బుక్స్, దుస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

కోహెడ, జూలై 15,ప్రభాతవార్త : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చొరవ చూపాలని ఎస్‌టియు ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాడ శ్రీధర్ అన్నారు. మండల పరిధిలోని శని

సభ్యత్వ నమోదు చేస్తున్న ఎస్‌టియు నేతలు

గరం, రామచంద్రపురం, వింజపల్లి, వర్కోలు,కోహెడ, తంగళ్లపల్లి, సీసీ పల్లి, బస్వాపూర్, సముద్రాల, గుండారెడ్డిపల్లి, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ఎస్‌టియు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సభ్యత్వ నమోద కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు విడుదల చేయడంతో పాటు సిపిఎస్‌ను రద్దు చేయాలన్నారు. ఉద్యోగులకు రావాల్సిన పిఆర్‌సిని అందించాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర, జిల్లా, మండల ప్రతినిధులు రంగరావు, వడ్లకొండ శ్రీనివాస్, కొర్తివాడ రాజేందర్, మురికి శ్రీనివాస్, మోర గణేష్, హరిదాసు, మహమ్మద్ కరీం, వెన్న చంద్రశేఖర్, రామంచ రవీందర్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి : ఆర్టీసీ డిఎం

సిద్దిపేట అర్బన్, జూలై 15, ప్రభాతవార్త : మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సిద్దిపేట ఆర్టీసి డిపో మేనేజర్ టి,రఘు అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని డిపో ఆవరణలో మంగళవారం మొక్కలు నాటారు. మొక్కలు నాటడం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. ఆర్టీసి ఉద్యోగులు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో పూల మొక్కలు నాటడడం జరుగుతుందన్నారు. నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసి ఉద్యోగులు, కార్మికులు రాజేందర్, రాములు, సత్తయ్య, మహేశ్వరీ, రంజిత్, ఎం.డి.మౌలానా, ఎల్లయ్య, హేమలత, సత్తయ్య పాల్గొన్నారు.

ఘనంగా శీత్లా భవాని వేడుకలు

శీత్లా భవాని వేడుకల దృశ్యం

అక్కన్నపేట, జూలై 15, ప్రభాతవార్త :మండలంలోని కేశనాయక్‌తండా, చెరువుముందుతండా, బోధన్ వాగుతండాలతో పాటు ఆయా తండాలలో మంగళవారం రోజున గిరిజనులు పెద్దఎత్తున శీత్లా భవాని వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈ శీత్లా వేడుకలు అనేది గిరిజన తండాలలో ప్రతీ ఏటా సాంప్రదాయంగా, ఆనవాయితీగా జరుపుకోవడం జరుగుతుందన్నారు.వేడుకల్లో ఏడుగురు భవాని మాతలను పూజించడం జరుగుతుందన్నారు. వర్షాలు పడి పాడి పంటలు, సమృద్ధిగా ఉండాలని గిరిజన దైవాలను వేడుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గోర్‌సేనా జిల్లా అధ్యక్షులు రాజునాయక్, తండాల నాయకులు ఇక్కా నాయక్, సర్దార్‌నాయక్, శ్రీనివాస్‌నాయక్, శివరాంనాయక్, శ్రీకాంత్ నాయక్, తిరుపతినాయక్‌తో పాటు తండాల వాసులు ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ సత్తా చాటాలి : మాజీ ఎమ్మెల్యే

హుస్నాబాద్ రూరల్, జూలై 15, ప్రభాతవార్త : వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధమై ఎన్నికల్లో పార్టీ సత్తాచాటాలని మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో అక్కన్నపేట మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. గ్రామాలోల కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, గత ప్రభుత్వంలో తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలయైందని ఆరోపించారు. వచ్చే స్థానిక ఎన్నికలలో వార్డు సభ్యుల నుండి , సర్పంచ్, ఎంపిటిసి, ఎంపిపి, జడ్పిటిసిల వరకు బిఆర్ఎస్ పార్టీ నాయకులే విజయసాధించబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. సమావేశంలో పార్టీ అక్కన్నపేట మండల అధ్యక్షులు పెసరు సాంబరాజు, మాజీ ఎంపిపి లక్ష్మీభీలునాయక్, మాజీ జడ్పిటిసి భూక్య మంగ,శ్రీనివాస్, మార్కెట్ కమిటి మాజీ చైర్మెన్‌లు కాసర్ల అశోక్‌బాబు, లింగాల సాయన్న, పార్టీ హుస్నాబాద్ మండల అధ్యక్షులు గంగం మధన్‌మోహన్‌రెడ్డి, టిఆర్ఎస్‌వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్శరాం తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

పదేళ్లు అవినీతి చేసి ఇప్పుడు దాడులకు పాల్పడున్న బిఆర్ఎస్ నేతలు

జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి

హుస్నాబాద్ రూరల్, జూలై 15, ప్రభాతవార్త

పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో అన్ని రంగాల్లో అవినీతి చేసి అవినీతిని ప్రస్తుతం బయటపెడుతున్న కొన్ని సంస్థలతో పాటు వ్యక్తులపై బిఆర్ఎస్ నాయకులు దాడులకు దిగుతున్నారని జిల్లా గ్రంథాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి ఆరోపించారు. మంగళవారం గత ప్రభుత్వ హయాంలో గౌరవెల్లి ప్రాజెక్టు విషయంలో నిర్వాసితులకు అండగా నిలిచిన తమతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, హౌజ్ ఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి, పట్టణ మాజీ అధ్యక్షుడు అక్కు శ్రీనివాస్‌తోపాటు మరో పదిమందిపై అప్పటి ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టించిందని, అప్పుడు పెట్టిన కేసులవిషయంలోనే ఇప్పటికీ తాము కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలోనే ఈ ప్రాంతానికి సాగునీరు అందించాలనే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తే ఆ ప్రాజెక్టు పూర్తి చేయకుండా

మాట్లాడుతున్న కేడం లింగమూర్తి

జిల్లాలో ఇతర ప్రాంతాలలో తర్వాత భూమిపూజలు చేసిన ప్రాజెక్టులను పూర్తి చేసుకుని ఈ ప్రాంత రైతులను బిఆర్ఎస్ మోసంచేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుండి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వాసితులతో మాట్లాడుతూ సామరస్యంగా ప్రాజెక్టు పూర్తయేందుకు ముందుకు సాగుతున్నారన్నారు. నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసినందుకు గత ప్రభుత్వం పోలీసులతో లాఠీ చార్జీ చేయించి వారిని నిర్బందించారన్నారు. చట్టం ఎవరికి చుట్టం కాదని తమపై పెట్టిన కేసులలో న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బంక చందు, నాయకులు కోమటి సత్యనారాయణ, బూరుగు కిష్టస్వామి, వెన్న రాజు, పున్న సది, వల్లపు రాజుతో పాటు తదితరులు ఉన్నారు.

ఎల్లమ్మ అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న దృశ్యం

ఎల్లమ్మ గుడిలో ఘనంగా ఆషాడం బోనాలు

సిద్దిపేట రూరల్, జూలై 15, ప్రభాతవార్త : సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శ్రీ మహారేణుక ఎల్లమ్మ దేవి ఆలయంలో గౌడ సంఘం, మహిళ భక్తులు మంగళవారం ఘనంగా బోనాలు నిర్వహించారు. డప్పు చప్పుళ్లతో శివసత్తుల,బైండ్లోళ్ల నృత్యాలతో మహిళలు అంగరంగ వైభవంగా బోనాలు తీశారు. ఆషాడాన్ని పురస్కరించుకొని మహిళలు బోనాలు తీయండతో పాటు ఎల్లమ్మ అమ్మవారికి ఓడి బియ్యాలు సమర్పించుకున్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు కిషోర్‌శర్మ మాట్లాడుతూ భక్తుల కొంగు బంగారంగా సిద్దిపేట శ్రీ మహా రేణుక ఎల్లమ్మ దేవి అమ్మవారు విరాజిల్లుతుందన్నార. కోరిన కోరికలు తీర్చే కల్పతరువుగా అమ్మవారు నిలుస్తుందన్నారు. మహిళ ప్రతినిధి గాదగోని కృష్ణవేణి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పల్లె లాల్ బహుదూర్‌గౌడ్, ఉపాధ్యక్షులు మార్క శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పల్లె బాలకిషన్‌గౌడ్, కోశాధికారి గాదగోని కిష్టయ్యగౌడ్, డైరెక్టర్లు గాదగోని సత్యంగౌడ్, పల్లె చంద్రశేఖర్‌గౌడ్, సభ్యులు రాహుల్‌గౌడ్, బందారం రాములుగౌడ్, పల్లె భాస్కర్‌గౌడ్, ముంద్రాతి శంకర్‌గౌడ్, ఎల్లంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

20న పోచమ్మ అమ్మవారికి బోనాలు

గజ్వేల్ టౌన్, జూలై 15 (ప్రభాతవార్త): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ ఆదివారం పోచమ్మ అమ్మవారికి బోనాల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల సంఘం సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం సంఘం సభ్యులు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ తాజా మాజీ కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బోనాల కార్యక్రమ నిర్వహణకు సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా అత్తెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ బోనాల కార్యక్రమానికి సహకరిస్తానని తెలిపారు.

జగదేవ్‌పూర్ ఎస్ఐకి సన్మానం

ఎస్ఐ కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

జగదేవ్‌పూర్, జూలై 15 (ప్రభాతవార్త): జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన జె.కృష్ణారెడ్డిని సోమవారం మండల కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఇక్బాల్, కొండపోచమ్మ మాజీ డైరెక్టర్ కుమ్మరి కనకయ్యలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఐలయ్య, ఎండి.బషీర్, ఎండి.ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

వర్గల్‌లో ఆరోగ్య మహిళా కార్యక్రమం

వర్గల్, జూలై 15 (ప్రభాతవార్త): ఇందిరా మహిళా శక్తి సంబరాలలో భాగంగా మంగళవారం సిద్దిపేట జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్య ఆదేశాల మేరకు మండలకేంద్రమైన వర్గల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని వైద్యాధికారిణి డాక్టర్ హరిత తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో ఉన్న 35 గ్రామ సంఘాలలోని ఒక్కో గ్రామ సంఘంనుండి ఐదుగురు లీడర్లు, ఒక అసిస్టెంట్‌కు మొదటి దశలో ఆరోగ్య, రక్తపరీక్షలు చేయడం జరిగిందన్నారు. 35 గ్రామ సంఘాలను ఏడు క్లస్టర్లుగా విభజించి రోజు 25 నుండి 30 మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వైద్యుల సలహాలు, సూచనలు పాటించి ప్రతి మహిళ ఆరోగ్య మహిళ కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల ఏపిఎం ఆనంద్‌కుమార్, హెల్త్ సూపర్వైజర్ టి.కళావతి, మండల సమైక్య అధ్యక్షులు, జిల్లా మహిళా అధ్యక్షులు రేణుక, సిసి సత్యనారాయణ, సుభాష్‌గౌడ్, నర్సింలు, రమేష్, సాయిలు, భాస్కర్, పద్మ లత, వివోఏలు లత, లావణ్య, అక్షర, ఎంఎస్ అకౌంట్ లత పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో విప్లవాత్మక మార్పులు

-కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్, జూలై 15 (ప్రభాతవార్త): గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో బ్రష్టు పట్టిన వైద్యరంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్ మాతా శిశు ప్రభుత్వాసుపత్రిలో ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నర్సారెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులను కార్పోరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతుండగా ప్రతి ఒక్కరూ ప్రభుత్వాసుపత్రులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేదల వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించి రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందుతుండగా రోగి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా చికిత్స నిమిత్తం ఎల్ఓసిలు సైతం అందిస్తున్నట్లు తెలిపారు. సొంతంగా డబ్బులు వెచ్చించి వైద్య సేవలు పొందిన పేదలకు సిఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మరమ్మతులు, ఖాళీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండగా స్థానిక ఆసుపత్రిలో ఏ అవసరం ఉన్నా పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. వైద్య సిబ్బంది స్థానికంగా ఉంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, తద్వారా ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం మహిళలు కార్పోరేట్ ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోవద్దని, ప్రభుత్వాసుపత్రిలో చక్కటి సేవలు అందుతున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ, ఐకెపి ఏపిఎం దుర్గాప్రసాద్, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సమీర్, జంగం రమేష్‌గౌడ్, గాడిపల్లి శ్రీనివాస్, కొండపోచమ్మ డైరెక్టర్ గుండు లక్ష్మణ్, గుంటుకు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

-బిజెపి మండల అధ్యక్షుడు సాయిరెడ్డి రాంరెడ్డి

ఎంపి రఘునందన్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న రాంరెడ్డి

మర్కుక్, జూలై 15 (ప్రభాతవార్త): మండలంలో పలు అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు సాయిరెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఎంపి మాధవనేని రఘునందన్‌రావును హైద్రాబాద్‌లోని వారి నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ మర్కుక్ మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు నిధులను మంజూరు చేస్తానని తెలిపినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.భాస్కర్‌రెడ్డి, ఆర్.లక్ష్మారెడ్డి ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికుల మహాసభను విజయవంతం చేయండి

జగదేవ్‌పూర్, జూలై 15 (ప్రభాతవార్త): భవన నిర్మాణ కార్మికుల మండల ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని సిద్దిపేట జిల్లా బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ కార్మికుల యూనియన్ ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్ అన్నారు. మంగళవారం మునిగడప, చాట్లపల్లి, వట్టిపల్లి, గుబ్బడి, తీగుల్ నర్సాపూర్‌లలో భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న 52 రకాల కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, వారి హక్కులను కాలరాస్తున్నాయని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 17వ తేదీన మండలంలో భవన నిర్మాణ కార్మికుల ప్రథమ మహాసభను నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ మరాఠి కృష్ణమూర్తి, వివిధ గ్రామాల కార్మికులు పాల్గొన్నారు.

ప్రథమ మహాసభ కరపత్రాన్ని కార్మికునికి అందజేస్తున్న కృష్ణమూర్తి

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ములుగు, జూలై 15 (ప్రభాతవార్త): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మాజీ కమాండెంట్ దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీ ఎయిర్ మార్షల్ బవిశెట్టి చంద్రశేఖర్ తెలిపారు. ములుగు మండలం లక్ష్మక్కపల్లి పరిధిలోని విపిజె ఫంక్షన్‌హాల్‌లో శ్రేయోభిలాషి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన విజన్-2, విజన్-3 కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఇటీవల నిర్వహించిన విజన్-2 స్పోర్ట్స్ మీట్‌లో క్రికెట్, వాలీబాల్ క్రీడల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేయడంతో పాటు నియోజకవర్గ పరిధిలోని పలు పాఠశాలలకు క్రీడా సామాగ్రిని అందజేశారు. ముందుగా లక్ష్మక్కపల్లిలోని ఆర్‌విఎం ఆసుపత్రిలో విజన్-3లో భాగంగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేసిన ట్రస్టు సభ్యుడు మధుసూదన్‌రెడ్డిని అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యంతో చదువుకొని తమ ప్రతిభను కనబర్చాలని, ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థులు చదువుకునే దిశ నుండే సామాజిక సేవ, దేశభక్తిని అలవర్చుకోవాలని, భవిష్యత్తులో విద్యార్థులు ఉపాధి పొందుతూ ఇతరులకు ఉపాధి కల్పించే దిశగా ముందుకు వెళ్ళాలన్నారు. మండల విద్యాధికారి ఉదయ భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులను చదువుతో

విద్యార్థులకు క్రీడా సామాగ్రి అందజేస్తున్న బవిశెట్టి చంద్రశేఖర్

పాటు క్రీడలలో ప్రోత్సహిస్తున్న శ్రేయోభిలాషి సేవా ట్రస్టు సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా శ్రేయోభిలాషి సేవా ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు విష్ణుజగతి ముఖ్య అతిథులను సత్కరించి మెమొంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వెరిటాస్ సైనిక్ స్కూల్ చైర్మన్ శేషారెడ్డి, ఆర్‌విఎం ఆసుపత్రి చైర్మన్ యాకయ్య, సీఈఓ శ్రీనివాస్, పిడి రామ్‌నరసింహగౌడ్, శ్రేయోభాలాషి సేవా ట్రస్టు జాయింట్ సెక్రటరీ మొగిలి రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారి గంప ఆంజనేయులు, సభ్యులు చంటి, చంద్రశేఖర్,కర్ర వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వర్లు, పోతంచెట్టు వెంకటేశ్వర్లు, బండారి కృష్ణ, ఎర్ర పురుషోత్తం, రాజశేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గంగాధర్, విజయపాల్‌రెడ్డి, ఆకుల సుధాకర్, శ్రీరాములు, చంద్రమౌళి, వెంకటేష్, విజయేందర్ రెడ్డి, కనకరాజు, భీమేశ్వర్, మిర్యాల ప్రవీణ్, చింటు, బ్రహ్మారెడ్డి, వివిధ పాఠశాలల పీఈటీలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేటి 'మానవహారం'ను విజయవంతం చేయాలి

చేర్యాల, జూలై 15, ప్రభాతవార్త : చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలని కోరుతూ నేడు జెఎసి ఆధ్వర్యంలో నిర్వహించబోయే మానవహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెఎసి చైర్మన్ వకుళభరణం నర్సయ్య పంతులు కోరారు. బుధవారం చేర్యాల పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద నిర్వహించబోయే ఈ కార్యక్రమానికి నాలుగు మండలాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థుకు ప్లేట్లు పంపిణీ

సిద్దిపేట అర్బన్. జూలై 15,ప్రభాతవార్త : సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని వెల్కటూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం సిద్దిపేట వాసవీ, వాసవి యూత్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో వాసవిక్లబ్ సిద్దిపేట పూర్వ డిప్యూటీ గవర్నర్ కొండ అంజయ్య ఆర్థిక సహాయంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేయడానికి ప్లేట్లు పంపిణీ చేశారు. భవిష్యత్‌లో మరిన్ని సేవాకార్యక్రమాలు చేపట్టి క్లబ్‌కు మంచి పేరు తీసుకురావాలని జిల్లా పిఆర్ఓ మంకాల శ్రీనివాస్ సూచించారు. నిరుపేదలకు సేవ చేయడంలోనే నిజమైన తృప్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆయా క్లబ్‌ల ప్రతినిధులు మురంశెట్టి కుమార్, ఎర్రం శివశంకర్, క్యాస బాలయ్య,జైన సత్యం, చిగుళ్లపల్లి సత్యనారాయణ, మర్యాల వీరేశం, పాఠశాల ఉపాధ్యాయుడు రమేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

బెజ్జంకి, జూలై 15,ప్రభాతవార్త : మండల పరిధిలోని దాచారం గ్రామం రైతు వేదికలో మంగళవారం మండల వ్యవసాయశాఖ, ఇఫ్కో సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి బి.సంతోష్, ఇఫ్కో ఏరియా మేనేజర్ చంద్రబాబునాయుడు మాట్లాడుతూ పొడి రూపంలో ఉండే సాధారణ యూరియా, డిఏపి మొక్కకు 60 శాతం మాత్రమే ఉపయోగపడి మిగతాది నేల,వాణ కాలుష్యం చేస్తుందని పెట్టుబడి వ్యయం పెరుగుతుందన్నారు. రైతులు ద్రవ రూపంలో ఉండే నానో యూరియా, నానో డిపిని నేరుగా మొక్కపైన పిచికారీ చేసుకుంటే మందు వృధా ఉండదన్నారు. కార్యక్రమంలో ఎఈఓ విజయ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్

సిద్దిపేట రూరల్, జూలై 15, ప్రభాతవార్త : సిద్దిపేట జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం నూతన జిల్లా అధ్యక్షులుగా సింగిరాల శ్రీనివాస్ ఎన్నికయ్యారని సంఘం ప్రతినిధులు తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విస్తృత స్థాయి సమావేశంలో నూతన అధ్యక్షునితో పాటు సంఘం ప్రతినిధులు పాల్గొని మాట్లాడారు. 13 నెలలుగా అధ్యక్షుడిగా కొనసాగిన కొత్వాల్ నరేందర్‌ను తొలిగించడం జరిగిందన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అల్పుల స్వామిని ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి జాలిగా విద్యాకర్, గౌరవ సలహాదారులు సింగిరాల కనకయ్య, వివిధ మండల నాయకులు శ్రీరామ్, స్వామి, శ్రీనివాస్, యాదగిరి, బాలరాజు, రమేష్,తిరుపతి, అనిల్,సుదర్శన్, నర్సింలు, రమేష్, రాజ్‌కుమార్, ధనుంజయ్,వెంకట్, శ్రీకాంత్, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

పేటలో ఘనంగా బోనాల పండుగ

సదాశివపేట, జూలై 15, ప్రభాతవార్త:

సదాశివపేటలో బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

ఆషాఢమాసం వచ్చిందంటేచాలు గ్రామదేవతలకు అమ్మవార్లకు అమ్మవార్లకు పండగే పండగ. సదాశివపేటలోని వివిధ దేవాలయాలలో వెలసిన దేవతామూర్తుల అమ్మవార్లకు భక్తులు బోనాలపండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గురునగర్‌కాలనీలో సాతాని శ్రీశైలం ఆధ్వర్యంలో నూతనంగా వెలిసిన భవానీమాతకు కాలనీలోని మహిళలు ప్రజలు ఊరేగింపుగా వెళ్లి బోనాలు సమర్పించారు. భక్తులు అమ్మవారి వేషధారణతో డప్పుచప్పుళ్ళు ఆటపాటలతో పురవీధుల గుండా బోనాలను ఊరేగించారు. సాగర్‌నగర్‌లోని మహంకాళీ మందిరంలో బోనాల ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఆయా దేవాలయాలలోని మహిళలు, భక్తులు ఈకార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఊరేగింపు టిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చింత సాయినాథ్, శివరాజ్‌పటేల్‌బృందం, కాంగ్రెస్‌నాయకులు మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ కంది కృష్ణ, మాజీ కౌన్సిలర్లు శంకర్‌గౌడ్, నాగరాజుగౌడ్, గుండు రవి, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

సదాశివపేట, జూలై 15, ప్రభాతవార్త:

యూరియా ప్రభుత్వం నిర్ణయించిన రేటు కన్నా బస్తాకి 50 రూపాయలు ఎక్కువధరకు రైతులకు అమ్ముతున్నారని తెలంగాణ రైతుసమాఖ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ సరస్వతికి ఫిర్యాదుచేశారు. దీనిపై ఎక్కడ కూడా విజిలెన్స్‌గానీ వ్యవసాయ అధికారులు కానీ పర్యవేక్షణ చేయటం లేదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసంచేస్తున్న వ్యాపారస్థులపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు పర్యవేక్షణచేయటం లేదన్నారు. వ్యాపారులు మందులను తమ ఇష్టంవచ్చినట్లు విక్రయించడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. ఈకార్యక్రమంలో అధ్యక్షులు పృథ్వీరాజ్, సంగిశెట్టి మల్లికార్జున్‌శెట్టి, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, సందీప్, స్వామి తదితరులు వున్నారు.

మహాధర్నాకు తరలివెళ్లిన బిఆర్ఎస్ నాయకులు

బిసి మహాధర్నాకు వెళ్తున్న బిఆర్ఎస్ నాయకులు

సదాశివపేట, జూలై 15, ప్రభాతవార్త:

సదాశివపేట మండలంలోని బిఆర్ఎస్ నాయకులు బిసి మహాధర్నాకు మంగళవారం తరలివెళ్లారు. ఈసందర్భంగా సదాశివపేట బిఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ అమలుచేసే విషయంలో రేవంత్‌రెడ్డి ఆడుతున్న కొత్త నాటకాన్ని బిసి మేధావులు, బిసి కులాల వారందరూ గ్రహించాలన్నారు. 42 శాతం బిసి రిజర్వేషన్ అమలుచేస్తామని బిసిలను మభ్యపెట్టడం మానుకోవాలన్నారు. పార్లమెంటులో రాహుల్‌గాంధీచే ఒత్తిడిచేసి బిజెపి ప్రభుత్వం బిసి రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత కల్పించి నిజాయితీ చాటుకోవాలని వారు తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ మండలపార్టీ అధ్యక్షులు పెద్దగొల్ల సత్యనారాయణ, సంతోష్, శివకుమార్, మండల సీనియర్ నాయకులు యాదగౌడ్, రాజు, ఆర్.శ్రీనివాస్, మాజీసర్పంచ్ గడ్డమీది సత్యనారాయణ, మండల టిఆర్ఎస్ యువత అధ్యక్షులు నరేష్‌గౌడ్, మాజీ గొర్రెకాపరులసంఘం డైరెక్టర్ నగేష్, బాపూజీ, సంతోష్‌గౌడ్, విద్యార్థి విభాగం మండల జనరల్‌సెక్రెటరీ అక్షయ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రోడ్ సేఫ్టీడ్రైవ్

-కార్పొరేటర్ వెన్నవరం సింధూ ఆదర్శ్‌రెడ్డి

రోడ్ సేఫ్టీ డ్రైవ్‌లో పాల్గొన్న కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, జూలై 15, ప్రభాతవార్త:

సమస్యల పరిష్కారానికే రోడ్ సేఫ్టీ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధూ ఆదర్శ్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో డివిజన్‌పరిధిలోని మ్యాక్ సొసైటీ కాలనీలో రోడ్‌సేఫ్టీ కార్యక్రమాన్ని నిర్వహించగా కార్పొరేటర్ పాల్గొని సమస్యలను తెలుసుకున్నారు. మ్యాక్ సొసైటీ కాలనీలో రోడ్డుపై ఏర్పడ్డ గుంతలతో ప్రజలు ఇక్కట్లు పడతారని, అందుకు ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు బాధ్యులకు సూచించామని కార్పొరేటర్ పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే గుంతలను పూడ్చేపనులు చేపట్టారు. డివిజన్ పరిధిలో ఎక్కడైనా రోడ్డుపై గుంతలు ఉంటే జిహెచ్ఎంసి సిబ్బంది వెంటనే స్పందించి గుంతలను పూడ్చేలా చర్యలుతీసుకోవాలని ఆదేశించారు. మ్యాక్ సొసైటీలోని పార్కును సందర్శించి మరమ్మతు పనులను పర్యవేక్షించారు. పార్క్‌లో చిన్నారుల కోసం ప్లే ఎక్విప్‌మెంట్, సీనియర్ సిటిజన్ల కోసం బెంచీలు ఏర్పాటుచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఎఈ ఫైజాన్, వర్క్ ఇన్స్‌పెక్టర్ అక్రమ్, మ్యాక్ సొసైటీ డైరెక్టర్లు రామరావు, దుర్గారెడ్డి, బిఆర్ఎస్ యువజన నాయకులు సుధాకర్, విజయ్, రాజు, కొండల్‌లు పాల్గొన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్‌గా లక్ష్మీప్రసన్న

మనూర్, జూలై 15, ప్రభాతవార్త:

మండలకేంద్రమైన మనూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా లక్ష్మీప్రసన్న మంగళవారం పదవీబాధ్యతలు స్వీకరించారు. పటాన్‌చెరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజికల్ సైన్స్ లెక్చరర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న లక్ష్మీప్రసన్న పదోన్నతిపై మనూర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ అయి మంగళవారం కళాశాలలో బాధ్యతలు స్వీకరించారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీప్రసన్నకు మండలవిద్యాధికారి రాజశేఖర్‌శెట్కార్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ జూనియర్ కళాశాల మాజీప్రిన్సిపాల్ కళింగ కృష్ణకుమార్, వెంకటేశం, లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఏర్పాటుకు చర్యలు తీసుకోండి

-అధికారులను ఆదేశించిన కార్పొరేటర్

పాషాకాలనీలో బస్తీదర్శన్‌లో పాల్గొన్న కార్పొరేటర్ పుష్పనగేష్

రామచంద్రాపురం, జూలై 15, ప్రభాతవార్త:

ఈ నెల 20వ తారీకున ఆషాఢమాసం బోనాల పండగను పురస్కరించుకుని ఆలయాలవద్ద పరిశుభ్రత, అలంకరణ ఏర్పాట్లుచేయాలని రామచంద్రాపురం కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బూరుగడ్డ పుష్పనగేష్ అధికారులకు సూచించారు. మంగళవారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఓల్డ్ రామచంద్రాపురం, అంబేద్కర్‌కాలనీ, శ్రీనివాస్‌నగర్‌కాలనీల్లోని ఆలయాలను సందర్శించి బోనాల ఏర్పాటుకు తీసుకోవాల్సిన జాగ్రతలపై అధికారులు, స్థానికులతో సమీక్షించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ పుష్పనగేష్ మాట్లాడుతూ బోనాలుజరిగే 8ఆలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా, గుంతలమయంగా ఉన్న రోడ్లను బాగుచేయించడం, లైటింగ్ ఏర్పాట్లు, విద్యుత్‌సమస్య తలెత్తకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రతలపై అధికారులకు వివరించారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఎఎంఓహెచ్ విజయ్‌మోహన్, ఎస్ఎస్ పవన్, ఎస్ఆర్పీ మల్లికార్జున్, శానిటరీ సిబ్బంది, నాయకులు నవీన్‌గౌడ్, చిగురు శ్రీను, రాములుయాదవ్, కిరణ్‌గౌడ్, అప్పల భాస్కర్, రవిగౌడ్, అప్పల సత్తి, సంతోష్‌గౌడ్, మహిపాల్‌గౌడ్, కురుమ శ్రీను,కుమ్మరి మాణయ్య, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

పాషాకాలనీలో బస్తీదర్శన్...

రామచంద్రాపురండివిజన్ పరిధిలోని పాషాకాలనీలో మంగళవారం బస్తీదర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బూరుగడ్డ పుష్పనగేష్ ఎఎంఓహెచ్ విజయ్‌మోహన్, ఎస్ఎస్ పవన్, రాంకీ ఇంచార్జి విజయభాస్కర్‌రెడ్డి, జిహెచ్ఎంసి శానిటేషన్, రాంకీవిభాగం అధికారులు, సిబ్బందితో కలిసి కాలనీలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో ఓపెన్‌డ్రైన్ నిండిపోయి ఇళ్లలోకి మురుగునీరు చేరుతుండటంతో ఇబ్బందులు పడుతున్నామని, కాలనీ ముఖద్వారం వద్ద చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లడంతోపాటు దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని కాలనీవాసులు బస్తీదర్శన్ దృష్టికి తీసుకుపోయారు. విద్యుత్‌స్తంభాలు పడిపోయే దుస్థితిలో ఉన్నాయని, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకుపోయారు. కాలనీలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కారం చేస్తామని కార్పొరేటర్ పుష్పనగేష్ కాలనీవాసులకు భరోసాకల్పించారు. కార్యక్రమంలో చాంద్,రఫీక్,నవీన్‌గౌడ్, చిగురు శ్రీను, రాములు యాదవ్, కిరణ్‌గౌడ్, అప్పల భాస్కర్, రవిగౌడ్, అప్పల సత్తి, సంతోష్‌గౌడ్, మహిపాల్‌గౌడ్, కురుమ శ్రీను, కుమ్మరి మాణయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి రూ.25లక్షలు అందించాలి

-కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలి

-వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు



ఎంపిడిఓకు వినతిపత్రం అందచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

ఝరాసంగం, జూలై 15, ప్రభాతవార్త:

గత మూడు మాసాలుగా చేసిన పనికి డబ్బులు రాకపోవడంతో ఓ వైపు, మరో వైపు అధికారుల ఒత్తిడితో మండలపరిధిలోని చీలపల్లికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ శివన్న గుండెపోటుకు గురై మరణించాడని, మృతుడి కుటుంబానికి రూ.25లక్షల పరిహారం అందించి కుటుంబాన్ని ఆదుకోవాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు బి.రామచందర్, ఎం. నర్సింలు డిమాండ్‌చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ శివన్న మృతిచెందడంతో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ఝరాసంగంలోని మండలపరిషత్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఎంపిడిఓకు వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా రామచందర్, నర్సింలు మాట్లాడుతూ పనిచేసినా నెల నెల జీతాలు చెల్లించకుంటే వారు తమ కుటుంబాలను ఎలా సాకుతారని ప్రశ్నించారు. మృతిచెందిన ఫీల్ట్ అసిస్టెంట్ కుటుంబానికి రూ.25లక్షల పరిహారం అందించి ప్రభుత్వం బకాయిపడ్డ 3నెలల జీతం కుటుంబసభ్యులకు అందించడంతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్‌చేశారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వర్, సంజీవ్, ప్రభాకర్, తాజుద్దీన్, నవీన్, తేజ, సిద్దప్ప, రాజన్న, నరసింహులు, చక్రపాణి, వేణుగోపాల్, షరీఫ్, మొగులయ్య, రాణెమ్మ, రాజేందర్, అనిల్, రాజు, వసంత్, సుధాకర్ పాల్గొన్నారు.

పోచమ్మతల్లికి ఆషాఢమాస బోనాలు

పోచమ్మతల్లికి బోనాలు ఊరేగిస్తున్న భక్తుల దృశ్యం

న్యాల్‌కల్, జూలై 15, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని మాణిక్‌నగర్ కాలనీలో మంగళవారం ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని కాలనీలో కొలువున్న పోచమ్మతల్లికి కాలనీ భక్తులు బోనాలను సమర్పించారు. కాలనీకి చెందిన మహిళలు తమ ఇళ్ల నుంచి బోనాలను తీసుకుని కాలనీ కూడలికి చేరుకుని సామూహికంగా భజనలు చేస్తూ బోనాలను ఊరేగిస్తూ ఆలయానికి చేరుకుని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.

ఖరీఫ్ సాగుకు సింగూరు జలాలు

-త్వరలో ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

సింగూరు ప్రాజెక్టు దృశ్యం

చౌటకూరు, జూలై 14, ప్రభాతవార్త:

ఖరీఫ్‌పంటల సాగుకు సింగూరుజలాలను విడుదలచేసేందుకు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల సూచనలమేరకు అధికారులు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. కాలువల ఆధునీకరణ పేరుతో గత రెండుపంటలకు సింగూరు నీరు విడుదల చేయకపోవడంతో, ఈసారైనా నీరు విడుదలచేస్తారో, లేదో అని అన్నదాతలు అధైర్యపడుతున్నట్లు తెలుస్తుండటంతో నీటివిడుదలకు రెండు మూడు రోజుల్లో ఉత్తర్వులు వెలువడే అవకాశాలు ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలోపెట్టుకుని సింగూరుజలాల విడుదలకు ప్రభుత్వం అంగీకరించినట్లు తెలుస్తోంది. శనివారం మంత్రి దామోదర్ రాజనర్సింహాను సంగారెడ్డిలోని ఆయననివాసంలో నియోజకవర్గ నాయకులు కలుసుకుని సమస్యను మంత్రిదృష్టికి తీసుకుపోయినట్లు తెలుస్తోంది. మంత్రి సూచనలమేరకు సింగూరుజలాలను పంటలసాగుకు విడుదలచేయాలని అధికారులు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

సింగూరు ప్రాజెక్టును సందర్శించనున్న ప్రముఖులు...

ఈ నెల 16వ తారీకున సింగూరుప్రాజెక్టును పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షురాలు చిన్నమైల్ గోదావరి అంజిరెడ్డి, జహీరాబాద్ మాజీ ఎంపి బిబి.పాటిల్‌లు సందర్శించనున్నారు. వానాకాలం పంటలసాగుకు సింగూరుజలాలను విడుదల చేయకపోతుండటంతో రైతులు పడుతున్న పాట్లను పరిష్కరించేదిశగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సింగూరుప్రాజెక్టును, ఎడమకాలువను పరిశీలించనున్నట్లు పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఎ.వెంకటనరసింహారెడ్డి, పుల్‌కల్ మండలపార్టీ అధ్యక్షులు అమ్మల నవీన్‌లు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు నాయకులు ప్రాజెక్టు వద్దకు చేరుంటారని, ఉమ్మడి పుల్‌కల్ మండలపార్టీ నాయకులు, రైతులు పెద్దసంఖ్యలో ప్రాజెక్టువద్దకు చేరుకోవాలని వారు సూచించారు.

బిసి ధర్నాకు తరలివెళ్లిన ఎమ్మెల్యే

బిసి ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, బిఆర్ఎస్ నాయకులు

జహీరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:

హైద్రాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన బిసి మహాధర్నాకు ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్‌ల ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఆయా మండలాల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో మంగళవారం తరలివెళ్లారు. కార్యక్రమంలో జహీరాబాద్, మగుడంపల్లి, కోహీర్, ఝరాసంగం మండలాల బిఆర్ఎస్ అధ్యక్షులు తట్టు నారాయణ, సంజీవ్‌రెడ్డి, నర్సింలు, వెంకటేశంలు ఉన్నారు.

సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలి

పిఆర్‌టియు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మునిపల్లి, జూలై 15, ప్రభాతవార్త:

పిఆర్‌టియు ఉపాధ్యాయసంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మునిపల్లి మండలంలో మంగళవారం సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభు ప్రారంభించారు. సభ్యత్వ నమోదులో భాగంగా మండలంలోని వివిధ పాఠశాలలని సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలని అడిగితెలుసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ఉద్యోగ ఉపాధ్యాయులను ఆందోళనకి గురిచేస్తున్న సిపిఎస్ విధానాన్ని వెంటనే రద్దుచేయాలని ఈ అంశాన్ని రాష్ట్రప్రభుత్వం కూడా ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉంచిందని, సిపిఎస్ రద్దుచేసి ఈ హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్‌చేశారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న డిఏలని విడుదలచేసి ఒకేవిడత లో బకాయిలనుచెల్లించాలని, పదవీవిరమణపొందిన ఉపాధ్యాయులకి అందవలసిన ప్రయోజనాలు, మెడికల్ బిల్‌లు, ఆర్జిత సెలవుల నగదు, జిపిఎస్ నగదు వెంటనే విడుదల చేయాలని, అదేవిధంగా మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద జీతాలు జమచేయాలని సమగ్రశిక్ష ఉద్యోగులకు పే స్కేల్ వర్తింపజేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్‌చేశారు. వర్క్ అడ్జస్ట్‌మెంట్ విషయంలో ప్రభుత్వ ఉత్తర్వులప్రకారం అనుసరిస్తున్న రేషియో ప్రకారం ప్రాథమిక పాఠశాలలలో విద్య కుంటుబడే అవకాశం ఉందని ప్రతి 15మంది పిల్లలకి ఒక టీచర్ ఉండేలా వర్క్ అడ్జస్ట్‌మెంట్‌చేసి, ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఒక పిఎస్‌హెచ్ఎం పోస్ట్ ఉండేలా చూడాలనికోరారు. మండల అధ్యక్షులు చంద్రమౌళి ప్రధాన కార్యదర్శి సురేందర్‌లు మాట్లాడుతూ ఈ సంవత్సరం సభ్యత్వ నమోదుకు మంచి స్పందన లభిస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఉమేష్, జిల్లా నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వీరయ్య, వీరన్న, మండల నాయకులు భాస్కర్‌రెడ్డి, సిద్దేశ్వర్, కిష్టయ్య, రాజు, కరుణాకర్‌రెడ్డి, గోపాల్, రమణ, ఇతర నాయకులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ విధానం ఓ వరం

-శివంపేట పాఠశాలలో పోస్టర్ ఆవిష్కరణ

చౌటకూరు, జూలై 15, ప్రభాతవార్త:

ఓపెన్ స్కూల్ విధానం ఓ వరం లాంటిదని మండల పరిధిలోని శివంపేట పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేదశ్రీ అన్నారు. మంగళవారం పాఠశాలలో ఓపెన్‌స్కూల్ అడ్మిషన్‌ల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు వేదశ్రీ మాట్లాడుతూ మధ్యలో చదువు మానేసినవారు మళ్లీ కొనసాగించే అవకాశం ఓపెన్‌స్కూల్‌లో దక్కుతుందన్నారు. ఓపెన్‌స్కూల్ సర్టిఫికెట్లు రెగ్యులర్ సర్టిఫికెట్లతో సమానమని గుర్తుచేశారు. ఉద్యోగాలకు, పదోన్నతులకు, ఉన్నతచదువులకు, ఉపాధి అవకాశాలు పొందేందుకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అపరాధ రుసుము లేకుండా జూలై 28వతారీకు వరకు, అపరాధరుసుమతో జూలై 31వరకు అడ్మిషన్లు పొందవచ్చన్నారు. డ్రాప్‌అవుట్ అయినవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయులు వేదశ్రీ సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.మల్లేశం, ఖదీర్, ఎన్.రాములు, ఎస్.రాములు, సునీతాబాయి, వీరేశం, కంప్యూటర్ ఆపరేటర్ మాజీద్‌లు పాల్గొన్నారు.

బిసి మహాధర్నాకు తరలివెళ్లిన నాయకులు

చౌటకూరు, జూలై 15, ప్రభాతవార్త:

బిసి మహాధర్నాకు తరలివెళుతున్న బిసిసంఘం నాయకులు

హైద్రాబాద్‌లోని ఇందిరాపార్క్‌వద్ద బిసిసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బిసి మహాధర్నాలో పాల్గొనేందుకు చౌటకూరు, పుల్‌కల్ మండలాల్లోని బిసిసంఘాల నాయకులు మంగళవారం తరలివెళ్లారు. ఆయా మండలాలకు చెందిన పడమటి రమేష్, జీల మహేష్ ముదిరాజ్, ఇందూరి మోహన్, రాజాగౌడ్, చౌకంపల్లి శివకుమార్, అనంతి, మల్లేశం తదితరులు తరలివెళ్లినవారిలో ఉన్నారు.

ఆచార్య కళాశాలలో వనమహోత్సవం

-ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటిన విద్యార్థులు

కళాశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, అధ్యాపకులు

జహీరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:

పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల హరికుమార్ ప్రారంభించగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు మొక్కలు నాటారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలునాటి వాటిని సంరక్షించుకుంటే పర్యావరణపరిరక్షణ, ప్రశాంత వాతావరణం అందుబాటులో ఉంటుందన్నారు. ప్రతిగ్రామంలో మొక్కల పెంపకంపై ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అవగాహన కల్పించాలన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు కళాశాల ప్రిన్సిపాల్ బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు నవీన్, రమేష్, నర్సింలు, ఇరిషత్ సుల్తానా, లావణ్య, శ్రావణి, జగదేవి, నికిత, కీర్తి, సల్మావోనిసా, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్‌రెడ్డి, నందుగౌడ్, దత్తు, దీపిక పాల్గొన్నారు.

పెస్టిసైడ్ దుకాణాలను తనిఖీచేసిన ఎఓ

పెస్టిసైడ్ దుకాణాన్ని తనిఖీచేస్తున్న మండల వ్యవసాయాధికారి

సిర్గాపూర్, జూలై 15, ప్రభాతవార్త:

మండలంలోని ఆయా గ్రామాల్లోని ఎరువుల, విత్తనాలు దుకాణాలను మంగళవారం మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ తనిఖీ చేశారు. దుకాణాల్లో నిర్వహిస్తున్న పుస్తకాలను, ఈపిఓఎస్ రిపోర్టులను పరిశీలించారు. ఈసందర్భంగా ఎఓ మాట్లాడుతూ దుకాణాల నిర్వహణ తీరులో నిబంధనలు ఉల్లంగిస్తే కఠినచర్యలు తప్పవని, దుకాణాల నిర్వాహకులకు హెచ్చరించారు. ఎరువులు, విత్తనాలు ఖరీదుచేసిన రైతుల ఆధార్‌కార్డు వివరాలను నమోదు చేయాలని, రైతులకు విధిగా రసీదులు అందచేయాలని సూచించారు. రైతులు తాము అందుకున్న రశీదులను పంట చేతికి అందేవరకు భద్రపర్చుకోవాలని రైతులకు వివరించారు. రైతులకు ప్రయివేటు డీలర్లతోపాటు బొక్కన్గాన్, కడపల్ సొసైటీలలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల రైతులకు సూచించారు.

బిసిల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం మొసలి కన్నీరు

-బిఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షులు భక్తుల వీరప్ప

టేక్మాల్, జూలై 15, ప్రభాతవార్త:

బిసిలకు 42శాతం కోటాకు చట్టబద్ధత కల్పించకుండా ఆర్డినెన్స్‌కు క్యాబినెట్ నిర్ణయం ఒక డ్రామా అని మండల బిఆర్ఎస్‌పార్టీ అధ్యక్షులు భక్తుల వీరప్ప అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఆర్డినెన్స్ పరిష్కారమైతే, అసెంబ్లీ తీర్మానమెందుకుచేశారని ఆయన ప్రశ్నించారు, బిసిలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని ఆరోపించారు. రాష్ట్రపతికి బిల్లును పంపి తెలంగాణరాష్ట్రంలో ఆర్డినెన్స్ అంటూ డ్రామా మొదలుపెట్టారని అఖిలపక్ష సమావేశంలో తీర్మానంచేసి కేంద్రానికి పంపాలన్నారు. బిసిలకు 42శాతంకోటా అమలుచేయాలంటే రిజర్వేషన్ల మొత్తం 50శాతం మించకుండా సుప్రీంకోర్టు విధించిన పరిమితి ఉందన్నారు. దాన్ని దాటితే తమిళనాడు తరహాలో 9వ షెడ్యూల్‌లో చేర్చి, రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుందన్నారు. ఇవేవీ చేయకుండా అసెంబ్లీ తీర్మానంతో కాంగ్రెస్‌సర్కార్ చేతులు దులుపుకుందన్నారు. కేంద్రంపై ఒత్తిడి తీసుకురాకుండా, ఆర్డినెన్స్ అని కొత్త డ్రామా స్టార్ట్ చేసిందన్నారు. ఆర్డినెన్సే పరిష్కారమని భావించినప్పుడు అసెంబ్లీ తీర్మానం ఎందుకుచేసినట్టు రాష్ట్రపతికి ఎందుకుపంపినట్టు అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు.

17న టియుడబ్ల్యుజె (ఐజెయు) కార్యవర్గ సమావేశం

సంగారెడ్డి మున్సిపాలిటీ, జూలై 15, ప్రభాతవార్త:

తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ టియుడబ్ల్యుజె ఐజెయు జిల్లా కార్యవర్గ సమావేశం గురువారం సంగారెడ్డిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, ప్రధాన కార్యదర్శి విష్ణుప్రసాద్ మంగళవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో, జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈసమావేశంలో చర్చిస్తామని వారు పేర్కొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన జర్